## ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్ విజయసునీత

**విశాలాంధ్ర-అరకులోయ :** సార్వత్రిక ఎన్నికలను విజయ వంతం చేయడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేసామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత స్పష్టం చేసారు. గురువారం అరకులోయ తాహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ పార్టీల తరలింపు ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దూర ప్రాంతాలకు సకాలంలో మెటీరియల్, ఎన్నికల సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. సెక్టర్ అధికారులకు ప్రత్యేకంగా మాదిరి టూర్ ఏర్పాటు చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల మెటీరయల్ పంపిణీ ప్రక్రియ విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లను చైతన్యవంతం చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతోందన్నారు. అనంతరం పానీరంగిని, కొత్త బల్లుగుడ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్నను చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిదిలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల ఓటర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి. అభిషేక్ తాహశీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన సిమెంట్ మిల్లర్ లారీ

- డ్రైవర్ల నిర్లక్ష్యమే అంటున్న స్థానికులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న జాతీయ నిర్మాణ నిర్వాహకులు

**విశాలాంధ్ర-చింతపల్లి :** ఎస్.కోట నుంచి పాడేరు, చింతపల్లి అడ్డతీగల మీదుగా అమరావతిని కలిపే జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకు ప్రమాదాలు పెరిగి పోతున్నాయి. వివరాల్లోకి వెళితే మార్చి 9న జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలకు విద్యుత్ వైర్లు, స్తంభాలు పెంటపాడు నుంచి లంబసింగి తరలిస్తున్న క్రమంలో అంతర్ల సమీప వంతెన వద్ద ట్రాక్టర్ బోల్తా పడి కార్మికుడు సూపర్వైజర్ పట్రాసి సంతోష్ మృతిచెందిన విషయం మరవకముందే అదే గ్రామ సమీపంలో చింతపల్లి నుంచి పెదవలస వెళ్తున్న సురవరం గ్రామానికి చెందిన సతీష్ ఆటో నిలుపుదల చేసి ఉండగా రహదారికి ఇరువైపులా సిమెంట్ గోడ నిర్మాణ పనులు చేపడుతున్న సిమెంట్ మిల్లర్ డ్రైవర్ ఒక్కసారిగా గేరు మార్చి వదలడంతో ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సిమెంట్ మిల్లర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. కార్మికుల సహకారంతో అతడిని హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత జాతీయ రహదారి నిర్మాణ నిర్వహకులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ కార్మికుల భద్రతను గాలికి వదిలేసారని ఈప్రాంత ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ నిర్మాణంలో అనేకమంది కార్మికులు తీవ్రంగా గాయపడడంతో పాటు ప్రజలకు కూడా అసౌకర్యం కలిగిస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్మాణ నిర్వాహకులు కార్మికులు, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజఅతో పాటు ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి : ఐటిడిఏ పిఓ గనోరే

**విశాలాంధ్ర-రంపచోడవరం :** ఏజెన్సీలోని ఈ వేసవికాలంలో తాగునీరుకు ఇబ్బంది లేకుండా ప్రతి గ్రామంలో ఉన్న హ్యాండ్ బోర్లు మరమ్మత్తులు ఉన్న ఎడల వెంటనే మరమ్మతులు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారి ఛాంబర్లో ఏజెన్సీలోని అన్ని గ్రామాలలో త్రాగునీటికి ఎద్దడి లేకుండా డివిజనల్ పంచాయతీ అధికారితో, ఆర్డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ప్రాజెక్ట్ అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఈ సంవత్సరం వేసవికాలంలో మారుమూల గ్రామాలతో సహా అన్ని గ్రామాలలో తాగునీరు ఎద్దడి లేకుండా తాగునీరు ఏర్పాటు కోసం యాక్షన్ ప్లాన్ ప్రకారం పనిచేయాలని ఆయన అన్నారు, రంపచోడవరం ఏజెన్సీ పరిధిలో మొత్తం 3550 హ్యాండ్ బోర్లు కలవని ఇందులో ఒక్కొక్క మండలంలో ఎన్ని బోర్లు రిపేర్ల ఉన్నవి మండలాల వారిగా ఆయన ఆరా తీశారు, అదేవిధంగా ఒక్కొక్క మండలంలో ఎన్ని బోర్లు ఉన్నవి ఆబోర్లలో తాగునీటి కోసం ఎన్ని బోర్లు పనిచేయుచున్నవి అదేవిధంగా ఆయా బోర్లలో తాగునీటికి పనిచేయని బోర్ల ఏవిధంగా గుర్తించుచున్నది ఆ బోర్లలో త్రాగడానికి పనికి రావని వాడుకోవడానికి పనికి వస్తాయని ప్రజలకు ఏవిధంగా తెలియజేయుచున్నది ఆయన ఆరా తీశారు, ఏజెన్సీలోని సత్యసాయి పథకం ద్వారా, జల జీవన్‌మిషన్‌ద్వారా ఎన్ని గ్రామాలలో ప్రజలకు తాగునీరు అందించుచున్నది మండలాల వారీగా ఆరా తీశారు, హ్యాండ్ బోర్ల ద్వారా తాగునీరు ఏవిధంగా టెస్టులు చేయుచున్నది అదేవిధంగా ఎక్కడెక్కడ చేయుచున్నది ఆరా తీశారు. ఏజెన్సీలోని అన్ని మండలాలలో ఏఏ గ్రామాలలో వాటర్ ట్యాంకులు ఎన్ని ఉన్నవి మండలాల వారిగా ఆయన ఆరా తీశారు, అన్ని గ్రామాలలో హ్యాండ్ బోర్లు రిపేర్లకు ఎక్కువ ఏ పరికరాలు కావలసి ఉన్నది ఆరా తీశారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలలోని ప్రజలు కాలువలలో చెలమలు తీసుకొని త్రాగునీరు వాడుకుంటున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు తాగునీరు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించడం జరిగింది. ఈ వేసవికాలంలో ప్రజలకు త్రాగునీరు ఎద్దడి లేకుండా ఎక్కడికక్కడ తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఆర్ డబ్ల్యు ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్రబాబు, శివ, యస్ ఓ టీ. మార్తమ్మ ఏడు మండలాలకు సంబంధించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు,

## తెదేపా అభ్యర్థి మార్పుతో కుదేలైన కూటమి

**విశాలాంధ్ర-కూనవరం:** ఇటీవల రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో చోటు చేసుకున్న రాజకీయ ఘటనలు టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి దాదాపు ఖాయమనే సంకేతాలిచ్చాయి. ఆ ఆశతోనే కిందిస్థాయి మెజారిటీ కార్యకర్తలు ఐదేళ్లుగా కష్టపడి పనిచేశారు. పోలవరం పరిహారం ఇవ్వకపోవడం, ఎకరాకు ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వకపోవడం, గోదావరి వరదల పదివేల రూపాయల నష్ట పరిహారం ఇవ్వకపోవడం వంటి గత ప్రభుత్వ లోపాలను ఈసారి ఎన్నికల్లో ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తే తమ గెలుపు సునాయాసం అని తెదేపా శ్రేణులు సిద్ధమైన తరుణంలో రంపచోడవరం టికెట్ మిరియాల శిరీషకి కేటాయించారు. అనే పిడుగులాంటి వార్త తెలుగుదేశం బిజెపి జనసేన కూటమిలో నైరాశ్యాన్ని మిగిల్చింది. టికెట్ ఎవరికిచ్చినా పార్టీ ఆదేశాన్ని వందశాతం అనుసరిస్తామనే కార్యకర్తలు ఏపార్టీలోనైనా పది శాతమే ఉంటారు. ఆ పదిశాతం కార్యకర్తలు తప్ప మిగతా తొంభై శాతం మంది పార్టీ శ్రేణులు ఇప్పటికే కాడి కింద పడేశారు. చేతులారా గెలిచే స్థానాన్ని చేజార్చుకున్నట్టయిందని తెదేపా సీనియర్ నాయకులు ఎడవల్లి భాస్కరరావు, మాజీ జెడ్పిటిసి ఎడవల్లి కన్యకాపరమేశ్వరి, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు విశాలాంధ్రకు తెలపడం దీనికి నిదర్శనం. విలీన మండలాల్లో వంతల రాజేశ్వరికి ఉన్న ప్రజాభిమానం సానుభూతి కచ్చితంగా తాము గెలుస్తామనే నమ్మకాన్ని కలిగించిందని ఆనమ్మకాన్ని వమ్ము చేసి ఒక్క కొత్తపల్లి గీత గీసిన గీత దాటకుండా తెదేపా అధిష్టానం రాత్రికిరాత్రి టిక్కెట్టు మార్చివేయడంవల్ల ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన కార్యకర్తలు అందరిని ఒక్కసారిగా నిరాశకు గురిచేసిందని వాపోయారు. 27న నర్సింగపేట సాంబయ్య మాస్టారు మృతి సందర్భంగా ఆ ఊరు వెళ్లిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష వెంట ప్రధాన తెలుగుదేశం కార్యవర్గం లేకపోవడం ఈ వాదనకు మరింత ఊతమిస్తోంది.

**ఇక వైకాపా గెలుపు నల్లేరు మీద నడకే...** తెలుగుదేశం కూటమి అభ్యర్థి మార్పుతో వైకాపా శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది వరదలు కరోనా తుఫాన్లు వంటి విపత్కర పరిస్థితుల్లో విలీన మండలాల్లో కనీసం ముఖ పరిచయానికి కూడా నోచుకోని మిరియాల శిరీషను ఒక్కసారిగా ప్రజలు నెత్తిన పెట్టుకుంటారనేది వాస్తవ దూరం. కాబట్టి నాగులపల్లి ధనలక్ష్మి గెలుపు ఖాయం అవుతుందని, వర్గ విభేదాలు విడిచి మరి వైకాపా కార్య కార్యకర్తలు పనిచేయడం ఆ పార్టీకి శుభ పరిణామమని ఆపార్టీ సీనియర్ నాయకులు ఆవులు మరియదాసు తెలిపారు.

## మల్లె తోటలో అగ్నిప్రమాదం

**ఐదిళ్లు అగ్నికి ఆహుతి... నిరాశ్రయులైన ఏడు కుటుంబాల**

**విశాలాంధ్ర-చింతూరు :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మల్లెతోట గ్రామంలో గురువారం సాయంత్రం ఐదుఇళ్ళు అగ్ని కి ఆహుతి అయ్యాయి. కాక శరమయ్య, ప్రసాదు, ముచ్చిక బిగ్ బాస్, మల్లయ్య ,కళ్యాణ్, కాక సీతమ్మ, గొర్రె పిచ్చయ్య అనే వ్యక్తుల 5 తాటాకు ఇల్లు దగ్ధమయ్యాయి. మొత్తం ఐదు లక్షల ఆస్తి నష్టం ఉంటుందని తాసిల్దార్ నాజీముల్లాషా తెలిపారు. ఐటీడీఏ పీవో కావూరు చైతన్య సంఘటన స్థలాన్ని సందర్శించి అగ్ని ఓదార్చారు. వారికి ప్రభుత్వం నుంచి రావలసిన సౌకర్యాలను అందజేస్తామన్నారు. ప్రస్తుతానికి దుప్పట్లు, బరకాలు సప్లై చేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి తక్షణ సహాయంగా 10 కేజీల బియ్యం ,ఒక లీటర్ వంటనూనె, కేజీ కందిపప్పు ఇచ్చినట్లు తాసిల్దార్ తెలిపారు. పి ఒ వెంట సీనియర్ అసిస్టెంట్ పండా రామకృష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.

## వివాదాస్పద భూములో ఎట్టకేలకు రెవెన్యూ బోర్డు ఏర్పాటు

**విశాలాంధ్ర-అనంతగిరి :** కాశీపట్నం పంచాయతీ పరిధిలో నున్న వివాదస్పద భూమిలో రెవెన్యూ శాఖ ఎట్టకేలకు బోర్డు ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలో బంగారమ్మతల్లి ఆలయం సమిపములో 13-1,13-2 సర్వే నెంబర్ లలో వివాదాస్పద భూమి ఇది కొనరాదు అమ్మరాదు అని నిర్ధారిస్తూ మరలా బోర్డు ఏర్పటు చేశారు కాశీపట్నం పంచాయతీ విఆర్వో మానావతి స్వయంగా భూమి పైకి వెళ్లి ఏర్పటు చేశారు. ఈ భూమి 1/70 గిరిజన రక్షణ చట్టం రాక ముందు గిరిజనేతరుల పెరు మీద పట్టా ఉంది. ఈ చట్టం వచ్చిన తరువాత ఈ భూమి పై సర్వ హక్కులు ప్రభుత్వానికి చెందుతాయి. దీని ఆధారంగా ఈ భూమి మీద కొనుగోలు చేయడానికి, అమ్మడానికి ఎవరికి వీలు లేకుండా పోయింది. దింతో ఈ స్థలం ఎవరికి చెందకుండా ఉంది. ఇదే అదునుగా చేసుకున్న కొందరు భూ బాకాసురులు అసారాగా చేసుకుని బోర్డు ను తొలగించి వారి పని చాపకింద నీరు లాగా కొంతమంది వద్ద అడ్వాన్స్ రూపంలో భూబకాసురులు పొందినట్లు సమాచారం. ఈ విషయంపై పత్రికా ముఖంగా తెలిపి నప్పటికి బోర్డు ఏర్పటులో రెవెన్యూశాఖ స్పందించంలో కొంత ఆలస్యం జరగడం తో భూబకాసురులు ఈ భూమి పై లావాదేవీలు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు రెవెన్యూశాఖ గురువారం నాడు బోర్డు మరల ఏర్పటు చేశారు. ఇప్పటికైనా ఈ భూమి పై లావాదేవీలు అపుతారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## పాడేరులో వైసీపీని ఢీకొట్టే దమ్మున్న పార్టీ తెదేపా

**టిక్కెట్టు గిడ్డి ఈశ్వరికి కేటాయించాలి**

**తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు**

**విశాలాంధ్ర-చింతపల్లి:** పాడేరు నియోజకవర్గంలో టీడీపీ నుండి వైసీపీని ఢీకొట్టే దమ్మున్న నాయకురాలు గిడ్డి ఈశ్వరి మాత్రమేనని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, బిజెపి పార్టీలతో పొత్తులో భాగంగా అరకు నియోజక వర్గాన్ని బిజెపికి కేటాయించడంతో పాడేరు నియోజకవర్గంపై నెలకొన్న సందిగ్ధత తొలగి పోయిందన్నారు. పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించిన పది అసెంబ్లీ స్థానాలను ఆ పార్టీ ఇప్పటికే ప్రకటించడం జరిగిందని, దానితో పాడేరు అసెంబ్లీ స్థానం టీడీపీకి కేటాయించటానికి మార్గం సుగమమయిందన్నారు. దీనితో పార్టీ అధిష్టానం పాడేరు అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరికి కేటాయించేందుకు యోచిస్తుందన్నారు. పాడేరు నియోజకవర్గంలో వైసీపీని ఢీకొట్టే దమ్మున్న నాయకురాలు ఆమె మాత్రమేనని, ఆమెకు టిక్కెట్ కేటాయిస్తే పాడేరు నియోజక వర్గంలో ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు భూషణం, సీనియర్ నాయకుడు గొల్లోరి మంగు, దూరి రామకృష్ణ, గడుతూరి దేముడు, వెంకటరమణ, పౌలు తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దు చెక్ పోస్టును రిటర్నింగ్ అధికారి తనిఖీ

**విశాలాంధ్ర-పాచిపెంట:** ఆంధ్ర-ఒడిస్సా అంతర రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి సి. విష్ణు చరణ్ గురువారం తనిఖీ చేశారు. పి.కోనవలస, పద్మాపురం చెక్ పోస్టులను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లు వద్ద నిరంతర పటిష్ట నిఘా ఉండాలని ఆయన అన్నారు. నమోదయిన కేసుల వివరాలు, సీజ్ చేసిన వాహనాల వివరాలు, పట్టుబడిన నాటు సారా, రెండు చక్రాల వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు తరలించ కుండా 24 గంటలు పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా చెక్ పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏవిధమైన ఉదాసీనతను ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. వెబ్ కాస్టింగ్ విధిగా చేయాలని ఆయన అన్నారు. తహశీల్దార్, ఎఫ్ఎస్‌టి బృందాలు నిఘా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట ఎమ్మార్వో పి.బాల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బంగారునాయుడుకు కెఎన్‌వై పతంజలి అవార్డు పట్ల హర్షం

**విశాలాంధ్ర-పార్వతీపురం :** పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కథారచయిత, రైతు బంగారునాయుడుకు విజయనగరంకు చెందిన కె ఎన్ వై పతంజలి అవార్డును ప్రకటన చేయడంపట్ల పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పలు సాహితీ సంస్థలు, కథారచయితలు హర్షం వ్యక్తంచేశారు. బంగారునాయుడు సువర్ణముఖి కలంపేరుతో సాహితీ రచనలు చేస్తున్నాడు. ఆయన ఎన్నో కథలు, రచనలు చేయడంతోపాటు పలువురు రాసిన రచనలకు సమీక్షలు కూడా చేస్తున్నారు. ఆయన స్వగ్రామం జియ్యమ్మవలస మండలం పెదమేరంగి గ్రామానికి చెందినప్పటికీ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయనకు పతంజలి అవార్డు ప్రకటించడంపట్ల స్నేహకళా సాహితీ, అధ్యయన వేదిక, సాహితీ లహరి, అరసం తదితర సాహితీ సంస్థలతో పాటు రచయితలు గంటేడ గౌరునాయుడు, మంచుపల్లి శ్రీరాములు, మళ్ళిపురం జగదీష్, వక్కి రవీంద్ర, కుమార్‌వర్మ, చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు, రామలింగస్వామి, జి.రామకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

## పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ

**విశాలాంధ్ర-కురుపాం :** సాధారణ ఎన్నికలు..2024 నిర్వహణలో పోలింగ్ అధికారులు పూర్తి అవగాహన పొంది సమర్థవంతంగా నిర్వహించాలని కురుపాం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వివి రమణ అన్నారు. గురువారం స్థానిక ఎపి మోడల్ స్కూల్ లో జియ్యమ్మవలస, కొమరాడ మండలాల పిఓ, ఎపిఓలకు పిఓ ,ఎపిఓలకు మండలాల వారీగా ముందస్తుగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వివి రమణ మాట్లాడుతూ ఈవిఎం యంత్రాల వినియోగం, 17సి ఫారం నింపడం , ఎలక్షన్ ప్రోటోకాల్, పోలింగ్ రికార్డులు నిర్వహణ ,పిఓ డైరీ నిర్వహణ పై శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫోలింగ్ రోజు పాటించాల్సిన విధులు, భాధ్యతలు నిబంధనలు పూర్తి స్థాయిలో అవగాహన పొంది సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నియోజక వర్గం లో 693మంది పిఓ ,ఎపిఓ లు విధుల్లో పాల్గొనున్నారని తెలిపారు. 268పోలింగ్ కేంద్రాలు ఐదు మండలాల పరిధిలో ఉండగా 39సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పోలీసు శాఖ గుర్తించి నివేదిక ఇచ్చిందని వాటిలో మొబైల్ సిగ్నల్స్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు , వీడియో, వెబ్ కాస్టింగ్ అదనపు రక్షణకు పోలీసు సిబ్బంది నిర్మించటం జరిగిందని తెలిపారు. మాస్టర్ ట్రైనీ లద్వారా సిబ్బంది కి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు ప్రకారం ఏర్పాటు చేసిన అన్ని ఫార్మాట్లు, రికార్డు తప్పనిసరి గా పూర్తి చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి ఎస్ ఎస్ సత్యనారాయణ, ఎంఇఓ నారాయణ స్వామి , ట్రైనీ ఎ.జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధం... ఏప్రిల్19న నామినేషన్

**ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పుష్పశ్రీవాణి**

**విశాలాంధ్ర-కురుపాం :** 2024 సాధారణ ఎన్నికలు కు తాను సిద్ధం అంటూ సిటింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి ప్రకటించారు. ఏప్రిల్ నాలుగో తేదీన శుభ ముహూర్తాన ఎన్నికలు ప్రచారం ప్రారంభించనున్నట్లు , అలాగే ఏప్రిల్ 19 ఉదయం పదిగంటలకు తన నామినేషన్ దాఖలు చేయనున్నామని తెలిపారు. వైసిపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దశాబ్దాలుగా నియోజక వర్గంలో ప్రజలు వేచి చూసిన అభివృద్ధి కేవలం నాలుగున్నర సంవత్సరాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలన లో చేసి చూపామని ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి హ్యాట్రిక్ విజయం పొందుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడైనా బ్రహ్మరథం పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## ఒడిశా సరిహద్దు చెక్ పోస్టులను జిల్లా ఎస్పీ సందర్శన

**విశాలాంధ్ర -పార్వతీపురం/జిఎల్.పురం:** సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్వతీపురం మన్యం జిల్లాఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎల్విన్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఒరిస్సా సరిహద్దు గ్రామాలైన లద్ద,కొందుకుప్ప, సమస్యాత్మక గ్రామం చింతలపాడు పోలింగ్ స్టేషన్ల భవనాలను సందర్శించి వాటి యొక్క స్థితి గతులు,మౌలిక వసతులు,భద్రత పరమైన ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకొని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కురుపాం మండలంలోని ములిగూడ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీచేసి నాటుసారా మరియు గంజాయి అక్రమ రవాణా అరికట్టుటలో సిబ్బందికి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. ఈసందర్శనలో ఎస్పీతోపాటు ఎల్విన్పేట్ సి.ఐ పి.సత్యన్నారాయణ, ఎల్విన్పేట్ యస్.ఐ బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

**విశాలాంధ్ర-మక్కువ :** మన్యం జిల్లా మక్కువ మండలంలో కన్నంపేట గ్రామంలో చీపురు మహేష్ వివాహ పెళ్లి మండపం దగ్గర లైటింగ్ సెట్టింగ్ చేసే టైంలో విద్యుత్ షాక్‌కి గురై వ్యక్తి తీవ్ర గాయాలయ్యారు వెంటనే బొబ్బిలి హాస్పిటల్‌కి తరలించారు. ఊర్లో లైటింగ్ పనులకి, స్టేజ్ డెకరేషన్‌కి కూలి పనికి వెళ్తూ చీపురు మహేష్ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. అయితే కన్నంపేట స్టేజ్ డెకరేషన్ చేస్తూ విద్యుత్ షాక్ గురై ఆసుపత్రిలో మృతి చెందాడు. మక్కువ ఎస్సై నరసింహామూర్తి పోలీస్ స్టేషన్ కేసు చేశారు.

## జిల్లా కేంద్రంలో ఐటిఐ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్:** జిల్లాలో ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రం లేకపోవడం అన్యాయమని వెంటనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి పండు డిమాండ్ చేశారు. గురువారం డిఆర్ఓ. కేశవ నాయుడుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐటిఐ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, సాలూరు, గుమ్మలక్ష్మీ పురం, సీతంపేట ప్రాంతాలలో గల ఐటిఐ చదువుతున్న విద్యార్థులు రాజం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లిపరీక్షలు రాసే పరిస్థితి ఏర్పడుతుందని దానివలన విద్యార్థులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జులై చివరి వారంలో జరుగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటిఐ (ప్రైవేట్) కళాశాల యందు సుమారుగా 500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు సరిపడు తరగతి గదులు, కంప్యూటర్లు, ల్యాబులు తదితర అన్ని రకాల సౌకర్యాలు కలవని విద్యార్థుల తరపున ఎస్ఎఫ్ఐ భావిస్తుందని తెలిపారు. కావున మీరు వాస్తవాలను పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటిఐ (ప్రైవేట్) కళాశాల యందు పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

## మలేరియా ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలి

-ఎన్‌సివిబిడిసి రాష్ట్ర ఉప సంచాలకులు ఏటి రామానాదరావు

**విశాలాంధ్ర-పాచిపెంట :** జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలని ఎన్సివిబిడిసి రాష్ట్ర ఉప సంచాలకులు ఏ.టి. రామనాథ రావు అన్నారు. ఎన్సివిబిడిసి రాష్ట్ర ఉప సంచాలకులు జిల్లాలో గురువారం పర్యటించారు. తోణాం, పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ మొదలగు జ్వరాలు నమోదు వివరాలు, నిర్ధారణ పరీక్షలు, అందజేస్తున్న చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఎమ్3, ఎమ్ఎఫ్7 ల్యాబ్ రికార్డులను నిశితంగా పరిశీలించి నివేదికలు స్పష్టంగా ఉండాలని ల్యాబ్ సిబ్బందిని ఆదేశించారు. జ్వర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన వారికి రక్త పూతలు సేకరించాలన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వలెన్స్, ఫోకల్ స్ప్రేయింగ్ తదితర నివారణ చర్యలు చేపడుతున్న తీరుపై క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆరా తీశారు. మలేరియా,డెంగ్యూ నిర్ధారణ అయితే వివరాలు వెంటనే ఐహెచ్ఐపి పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో జ్వర నిర్ధారణ సామూహిక రక్త పరీక్షలు నిర్వహించి, దోమల వ్యాప్తి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రామనాథరావు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాలలో ఎక్కువగా దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వలెన్స్ చేపట్టాలని తద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు త్వరితగతిన గుర్తించి, చికిత్స అందజేయడం, అదేవిధంగా దోమల వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టడం తదితర కార్యచరణ ప్రణాళిక ప్రకారం చేపడుతూ ఉండాలని తద్వారా రానున్న వర్ష రుతువులో జ్వరాలు ప్రబలకుండా అదుపులో ఉంటాయన్నారు. శాఖల సమన్వయంతో జిల్లా స్థాయి, మండల స్థాయి సమావేశాలు నిర్వహించి దోమల వ్యాప్తి నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత అంశాలపై సమీక్షలు జరపాలన్నారు. డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలన్నారు. జిల్లాలో దోమల మందు స్ప్రేయింగ్ కు ఎంపిక కాబడిన 401 గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ మే15 నుండి ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఏఎంఓ లు సూర్యనారాయణ, డి.వి.రమణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, వైద్యాధికారులు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ సుజాత,సబ్ యూనిట్ అధికారి ఈశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ సౌకర్యాలను దివ్యాంగుల పిల్లలు సద్వినియోగపరుచుకోవాలి

**మండల విద్యాశాఖ అధికారి బి.రాజ్‌కుమార్**

**విశాలాంధ్ర-సాలూరు టౌన్ :** దివ్యాంగుల పిల్లలను వారిని ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకుని రావాలని మండల విద్యాశాఖ అధికారి బి.రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం రామాకొలనీలో ఉన్న భవిత కేంద్రంవద్ద సమగ్ర శిక్ష పార్వతిపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు మెడికల్ అసెస్మెంట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు సాలూరు, మక్కువ, పాచిపెంట, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు 80 మంది హాజరవ్వడం జరిగింది. సాలూరు మండల విద్యాశాఖ అధికారి బి.రాజకుమార్ అధ్యక్షతన వహించడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను దివ్యాంగులు పిల్లలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరడం జరిగింది. జిల్లా సహిత విద్య సమన్వయకర్త పి.భానుమూర్తి గారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా ద్వివ్యాంగుల పిల్లలకు అందిస్తున్న సేవలను గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రి ఈ.ఎన్.టి స్పెషలిస్ట్ డాక్టర్ లోక్ నాయక్ పరిశీలన చేసి పిల్లలకు అవసరమైన ఉపకరణలు ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సాలూరు పాచిపెంట మక్కువ సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది మరియు మండల సిబ్బంది.

## డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ నెల్లిపాక ఆరోగ్య ఉప కేంద్రం సందర్శన

**విశాలాంధ్ర-ఎటపాక :** మండలం, నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నెల్లిపాక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు గురువారం సందర్శించారు. గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవలు ఆరా తీశారు. వారిని ఆరోగ్య భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణీలకు బాలింతలకు, హెచ్‌బి పరీక్షలు చేయాలని, సిబ్బందికి సూచించారు. ఈ సందర్శనలో డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు ఎస్. ఓ. కైలాష్, డిపిఓ. సతీష్, సి.సి.మణికంత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష్, డాక్టర్ విష్ణు ప్రియ మరియు పిహెచ్ఎన్, ఏఎన్ఎంలు సంధ్యారాణి. రమణి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్స్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మినరసింహస్వామి ముడుపుల పూజలకు తరలివచ్చిన భక్తజనం

**విశాలాంధ్ర-సీతానగరం :** మండలకేంద్రంలో సువర్ణముఖి నదిఒడ్డునఉన్న శ్రీలక్ష్మినరసింహ స్వామి, శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో గురువారంనాడు ఓంనమో శ్రీలక్ష్మినరసింహ స్వామి, ఓంనమోనారాయణాయ, ఓంనమో శ్రీవేణుగోపాలస్వామి యేనమః, జై శ్రీమన్నారాయణ అంటూ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ప్రతీ గురువారంనాడు ముడుపుల పూజలకు వేకువ జామునుండే భక్తులువివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తునవాహనాలతో విచ్చేసి భక్తిశ్రద్ధలతో పూజలను చేస్తున్నారు. ఆలయఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, కృష్ణామాచార్యులు, మురారీ తదితరులు ముడుపుల పూజలను దగ్గరుండి చేయిస్తున్నారు. స్వామివారిని రకరకాల పూలతో చేసిన అలంకరణ కూడా భక్తులను ఆకట్టుకుంటుంది.ప్రతీగురువారం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి నరసింహస్వామీ ముడుపుల పూజలకు దూరప్రాంతాలనుండి కూడా పెద్ద ఎత్తున వాహనాలతో భక్తజనంవిచ్చేసి ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధలతో పూజలనుచేసి స్వామివారిని దర్శించుకుని, గోవింద గోవింద అంటూ 27సార్లు ప్రదక్షిణలు చేస్తూ స్వామివారిని దర్శించు కుంటున్నారు. పూజలయ్యాక తీర్ధ ప్రసాదాలు తీసుకొని వెళ్తున్నారు. ఒక్కొక్క బ్యాచ భక్తులు రెండుగంటలపాటు ముడుపుల పూజలకు ఆలయ ప్రాంగణంలో ఉంటూ భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.ఉదయం 3గంటల నుండి రాత్రి 8గంటల వరకు బ్యాచులవారీగా భక్తులు ముడుపులు పూజలను భక్తిశ్రద్ధలతో చేస్తున్నారు. పాత, కొత్త భక్తులు కలిపి ప్రతీ గురువారం దాదాపు రెండువేలమంది వరకు భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించడం గమనార్హం. 9వారాలు పూర్తయిన భక్తులు శనివారం ఉదయం వారు ఆలయంలో ఉంచిన ముడుపులని తీసుకొని వారిఇష్టదైవమైన ఆలయానికి వెళ్ళి ముడుపులు హుండీలోవేస్తారని అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు. అన్ని వర్గాలవారు, అన్ని వయస్సులవారు, స్త్రీ పురుషులు ముడుపుల పూజలకు తరలిరావడంతో సీతానగరం విశిష్టత ఇప్పుడు అందరికీ తెలుస్తోందని స్థానికులు చర్చించు కుంటున్నారు.

## సమాజ అభివృద్ధికి విద్యార్థులే పునాదులు

**విశాలాంధ్ర బ్యూరో-పాడేరు :** సమాజ అభివృద్ధికి విద్యార్థులే పునాదులని పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. నవంబరు నెల నుండి పది పరీక్షలకు వరకు గుత్తులపుట్టు, దిగు మోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో 42 మంది గిరిజన బాల బాలికలకు ప్రత్యేక బోధన అందించారు. ఈనెల 27 వ తేదీతో పది పరీక్షలు ముగియడం తో పదిలో పదికి పది మార్కులలు సాధించాలనే లక్ష్యంతో బోధన అందించిన విద్యార్థులతో గురువారం గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీన కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని మంచి ర్యాంకులు సాధించి విశాఖ పట్నం, పార్వతీపురం కాలేజీ ఆఫ్ ఎక్స్ లెన్స్ ప్రవేశం పొందాలని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుంటే తలిదండ్రులకు పుట్టిన ప్రాంతాలకు మంచి పేరొస్తుందన్నారు. అమ్మ,నాన్నలకు, ఉపాధ్యాయులకు గౌరవం పెరుగుతోందని చెప్పారు. గిరిజన ప్రాంతం మారాలంటే విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పురావాలని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు పాడేరు విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అవార్డులను, నగదు బహుమతులతో ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువుకుని ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్-1 అధికారులుగా ఎదగాలని పేర్కొన్నారు. గత సంవత్సరం గిరిపుత్రులకు అందించిన సివిల్స్ కోచింగ్ ముంచింగ్పుట్టు కు చెందిన విద్యార్థి డి ఎస్పీ మరొకరు లే సెక్రటరీ వంటి గ్రూప్-1 ఉద్యోగాలను సాధించారని గుర్తు చేసారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది సివిల్ శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల? సహాయ గిరిజన సంక్షేమాధికారిణి ఎల్.రజని, ప్రధానోపాధ్యాయులు సింహాచలం, గంగా భవాని, మంజులు, రీమలి జాన్, డిప్యూటీ వార్డెన్ శ్రీనివాస పడాల్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వరి వంగడాలను ప్రయోగాత్మక సాగు చేపట్టాలి

**వ్యవసాయ శాఖ ఏడిఏ మధుసూదన్‌రావు**

**విశాలాంధ్ర-పాచిపెంట :** రైతులు పాత వంగడాల స్థానంలో నూతన వరి వంగడాలను పరిశీలనాత్మకంగా రాబోయే ఖరీఫ్ సీజన్లో సాగు చేయాలని వ్యవసాయ శాఖ ఏడిఏ మధుసూదన అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఒకే రకమైన వరి రకాన్ని సాగు చేయడం వలన విత్తనం నాణ్యత తగ్గి పంట దిగుబడులు తగ్గిపోతాయని అన్నారు. రాబోయే ఖరీఫ్ కాలానికి ఆర్జీఎల్ 25 37 మరియు ఎంటియు 70 26 బిపిటి 32 91 రకాలను విడనాడి వాటి స్థానంలో ఎంటీయు 13 18 ఎన్ టి యు 1271 వంటి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. మండలంలో గల పెద్ద చీపురు వలస శ్యామల గౌరీపురం గ్రామాలలో గల రైతులతో గురువారం మాట్లాడారు.భూసారం నానాటికి క్షీణిస్తుందని భూమిని ఇప్పటినుండే బాగు చేసుకోవాలని అన్నారు. భూమిలో సేంద్రియ కార్బన్ పెరగాలంటే తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పూత దశలో కలియ దున్నుకోవాలని తెలిపారు. రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు మీద ఆధారపడకుండా సేంద్రియ ఎరువులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలనిఅన్నారు. సేంద్రియ మరియు రసాయన ఎరువులను సమ తూకంలో వినియోగించుకోవాలని అప్పుడే నేల ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యవంతమైన పంట పండుతుందని తెలిపారు.నానో ఎరువులు ఎంతో ప్రయోజనకరం అన్నారు. మారుతున్న నూతన సాంకేతికతతో తయారుచేసిన నానో యూరియా, నానో డిఏపి ఎరువులను వాడుకుంటే శ్రమ తగ్గడమే కాకుండా ఖర్చు కలిసి వస్తుందని అంతేకాకుండా ఈ నానో ఎరువులను పురుగుల మందులతో కలిపి పిచికారి చేసుకోవడం వలన పురుగుల మందుల యొక్క పనితనం పెరుగుతుందని ఈ నానో ఎరువులను తీసుకువెళ్లడం కూడా చాలా సులువని కాబట్టి రైతులు రాబోయే ఖరీఫ్ కాలానికి నానో ఎరువుల మీద దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్ మరియు నాగమణి, రైతులు పాల్గొన్నారు.

## తనకు ఓటునువేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించండి

**వైఎస్సార్సీపీ అభ్యర్థి జోగారావు విజ్ఞప్తి**

**విశాలాంధ్ర-సీతానగరం/పార్వతీపురం/బలిజిపేట:** రాష్ట్రంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి గతఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలనుచూసి వైఎస్సార్సీపీకు ఓటువేసి వైఎస్ జగన్మోహన్రెడ్డిని రెండోసారి సీఎం చేయాలని సిటింగ్ ఎమ్మెల్యే,పార్వతీపురం వైఎస్ఆర్సిపి అభ్యర్థి అలజంగి జోగారావు తెలిపారు.గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నియోజక వర్గంలోని మూడు మండలాల పరిధిలో పలుగ్రామాల్లో వ్యక్తిగతంగా నిర్వహించారు. నియోజకవర్గంలో గతఐదేళ్లుగా యెనలేని అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అందరికీ 24గంటలపాటు అందుబాటులో ఉండి ప్రజల కష్ట సుఖాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు రెండోసారి అవకాశాన్ని ఇవ్వాలని ఇంటింటికి వెళ్లి విజ్ఞప్తిచేస్తున్నారు. పలు గ్రామాల్లో ఆయనవెళ్ళి అవ్వాతాతలని, అక్కా చెల్లెళ్ళను , యువతీ యువకులను, వయోజనులను, వికలాంగులని, వృద్ధులను కలిసి ఓటును వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. తెల్లవారు జామునుండి రాత్రివరకు నేరుగా ఆయనే ఇంటింటికి వెళ్లి ప్రజలను, ఓటర్లను కలసి విజ్ఞప్తి చేస్తున్నారు. పలు గ్రామాల్లో జరిగిన వివాహా తదితర కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పలువురిని పరామర్శ చేసే కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారు.ఇదిలా ఉండగా సీతానగరం మండలంలోని వైఎస్సార్సీపీ ప్రజా ప్రతినిదులు,నాయకులు పలుగ్రామాల్లోకి వెళ్లి జోగారావుకు ఓటువేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు మాజీ జెడ్పీ చైర్మన్ వాకాడ నాగేశ్వర రావు,పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటిసి మామిడి బాబ్జిలు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం చేస్తున్నామని తెలిపారు. బలిజిపేట మండలంలోని జెడ్పీటీసీ అలజింగి రవికుమార్, ఎంపిపి ప్రతినిది జగన్మోహన్, వైస్ ఎంపిపి వెలిదిసాయి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మురళీ కృష్ణ తదితరులు ప్రచారాన్ని నిర్వహించారు.పార్వతీపురం పట్టణంలో, గ్రామీణ ప్రాంతంలో కూడా ప్రచారాన్ని పార్టీనేతలు, ప్రజాప్రతినిదులు నిర్వహిస్తున్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్సీపీ నాయకులు వ్యక్తిగతంగా ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

## చెక్‌పోస్ట్‌లు వద్ద నిరంతర పటిష్ట నిఘా ఉండాలి

**సరిహద్దు చెక్ పోస్టు తనిఖీలో ఆర్ఓ విష్ణుచరణ్**

**విశాలాంధ్ర-సాలూరు టౌన్ :** అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, సాలూరు శాసన సభ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సి. విష్ణు చరణ్ గురువారం తనిఖీ చేశారు. పి.కోనవలస, పద్మాపురం చెక్ పోస్టులను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లు వద్ద నిరంతర పటిష్ట నిఘా ఉండాలని ఆయన అన్నారు. నమోదయిన కేసుల వివరాలు, సీజ్ చేసినవాహనాల వివరాలు, పట్టుబడిన నాటు సారా, రెండు చక్రాల వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24 గంటలు పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా చెక్ పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏ విధమైన ఉదాసీనతను ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. వెబ్ కాస్టింగ్ విధిగా చేయాలని ఆయన అన్నారు. తహశీల్దార్, ఎఫ్ ఎస్ టి బృందాలు నిఘా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మరిపల్లిలో 'మేమూ సిద్ధం... మా బూత్ సిద్ధం' కార్యక్రమం

**విశాలాంధ్ర-సాలూరు రూరల్:** మండలంలో మరిపల్లి పంచాయతీ కేంద్రంలో మేమూ సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం స్థానిక ఎంపిటిసి సభ్యురాలు జన్ని సీతారాం, సీనియర్ నాయకులు కాగాన పోలినాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల పార్టీ అధ్యక్షుడు సువ్వాడ.భరత్ శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు వివరించడం తో పాటు పథకాల వలన ఎంత లబ్ది జరిగిందే తెలిపారు.గడిచిన ఐదేళ్లలో మరిపల్లి పంచాయతీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు.సాలూరు నియోజకవర్గంలో వైకాపా పార్టీ తరపున పోటీ చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే రాజన్నదొరను మరొకమారు గెలిపించుకోవాల్సిన ఆవశ్య కతను ప్రజలకు తెలియజేశారు.వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి రాజన్నదొరను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఆయనతోపాటు జగన్ సేవాదళ్ అధ్యక్షులు సువ్వాడ రామకృష్ణ, పిఏసియస్ అధ్యక్షులు పెద్దింటి మాధవరావు, సచివాలయం కన్వీనర్లు జన్ని సురేష్, సంగిరెడ్డి అశోక్,స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయసేవ విజ్ఞాన సదస్సును సద్వినియోగం చేసుకోండి

**పాడేరు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రదీప**

**విశాలాంధ్ర-పాడేరు :** గిరిజన ప్రాంతంలో కుల, ఆదాయ, స్థిరనివాస ధ్రువీకరణ పత్రాలపై న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప స్పష్టం చేశారు. గురువారం పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప మాట్లాడుతూ కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలపై న్యాయపరమైన సమస్యలను చర్చించుకొని పరిష్కరించే విధంగా కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, చట్టాలకు అనుగుణంగా కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయవలసి ఉంటుందన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే వాటిని అప్పీల్ చేసుకోవచ్చని, వాటి పరిష్కారానికి రెవెన్యూ శాఖ ద్వారా కృషి చేస్తామన్నారు. చట్టాలను ఉల్లంఘించి తప్పుడు పత్రాలను పొందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, పాడేరు తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, లీగల్ అడ్వైజర్ ప్రసాద్ నాయుడు, ఆయా మండలాల తహసీల్దారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి అంశంపై క్షుణ్ణంగా శిక్షణ ఇవ్వండి

**మాస్టర్ ట్రైనీలకు కలెక్టర్ హితబోధ**

**విశాలాంధ్ర బ్యూరో-పాడేరు :** రానున్న ఎన్నికలకు కేటాయించిన ఎన్నికల సిబ్బందికి ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా శిక్షణ ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మాస్టర్ ట్రైనీలకు హితబోధ చేసారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, మనకి అన్నీ తెలుసుననే భావం ఎవ్వరికీ ఉండకూడదని, ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుండి వచ్చే సూచనలు, నిభందనలు, మార్పులు, చేర్పులు గమనిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకోవాలని, శిక్షణలు ఎప్పటికప్పుడు నవీకరణకు తోడ్పడతాయని తెలిపారు. సమాచారం చేరవేయట౦లో అలసత్వం, జాప్యం ఉండరాదన్నారు. అదేవిధంగా భయాందోళనలకు గురి కాకూడదని, సూచించారు. ఇవిఎంల వినియోగంలో చిన్న పొరపాటు కూడా జరగరాదని, పొరపాటులు జరిగే అవకాశాలను, వాటిని సరిదిద్దుకునే అంశాలను ఎన్నికల సిబ్బందికి అర్థం అయ్యే రీతిలో తగు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి చిన్న విషయం అట్టడుగు క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు చేరే విధంగా శిక్షణ ఉండాలన్నారు. ఓటింగ్ పూర్తైన తరువాత నాలుగు రకాల సీల్స్ వేయాలని, ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య మెషిన్ మీద చూపించిన నంబరు, పిఒ డైరీలో నంబర్, ఓటింగ్ స్లిప్పులు తదితర ఐదు రకాల నంబర్లు ఒకేలా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ట్, వి.అభిషేక్, డిఆర్ఓ బి. పద్మావతి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ మరణం విచారకరం

**ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ వైకాపా అభ్యర్థి విశ్వేశ్వర రాజు**

**విశాలాంధ్ర-చింతపల్లి :** స్థానిక తపాలా శాఖలో (పోస్టాఫీస్) పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న చిందాడ సత్యనారాయణ (47) మరణం విచారకరమని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గం వైకాపా అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. మంగళవారం విధులకు వెళుతూ అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మరణించిన ఆయన పార్థివ దేహాన్ని గురువారం తెల్లవారుజామున చింతపల్లి అంబేద్కర్ కాలనీలోని స్వగృహానికి తీసుకురావడంతో విషయం తెలుసుకున్న పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ వైకాపా అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజులు స్థానిక జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి దారలక్ష్మి, ఏఎంసి మాజీ చైర్ పర్సన్ హోలియా రాణి, వివిధ పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలతో కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సతీమణి చింతపల్లి 2 ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మిని, కుటుంబ సభ్యులను ఓదార్చి సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పించారు.

## ఓటర్లకు అవగాహనా కార్యక్రమం

**విశాలాంధ్ర-రంపచోడవరం :** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లకు బి యల్ ఓ ల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం తహసిల్దార్ ఎ.కృష్ణజ్యోతి పేర్కొన్నారు. గురువారం రంపచోడవరం మండలం లోని పోక్స్ పేట, ఎర్రంపాలెం, గోవవరం, ఐ.పోలవరం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తాసిల్దార్ పర్యటించి పరిశీలించడం జరిగింది, ఈ సందర్భంగా రంపచోడవరం తాసిల్దార్ కృష్ణ జ్యోతి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ వారి ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసి అదేవిధంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో వికలాంగులకు ఎన్నికల సంఘం నిబంధనలమేరకు ర్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అదేవిధంగా వికలాంగులు ఓటు వేయడానికి వచ్చినప్పుడు లైన్లో లేకుండా కొంచెం వెసులుబాటు కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బిఎల్ఓల ద్వారా ఓటర్లకు అదేవిధంగా వివిధ రకాలైన వికలాంగులకు ఎన్నికలకు సంబంధించిన అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు, 18 సంవత్సరములు నిండిన యువతి యువకులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు, ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఓటర్లు నిర్భయముగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అదేవిధంగా త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ఈవీఎంలపై గుర్తులు ఉంటాయని ఓటర్లకు ఆమె తెలియజేయడం జరిగింది. తహసిల్దార్ వెంట మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ విగ్నేష్, వీఆర్వోలు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ గుర్తుపై పోటీచేసి గెలిచేది నేనే...

**అరకు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ దొన్ను దొర ధీమా**

**విశాలాంధ్ర-అరకులోయ :** అరకులోయ నియోజకవర్గం టిడిపి శ్రేణుల్లో గందరగోళం, అసెంబ్లీ ఎన్డీఏ కూటమి అభ్యర్థి దొన్నుదొరను కాదని కూటమి అభ్యర్థులలో మరో ఒక్కరు బిజెపి అభ్యర్థి రాజరావును ఎన్డీఏ కూటమి అరకు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించడంపై టిడిపి శ్రేణుల్లో గందరగోళనికి నెలకొంది, అయితే అసంతృప్తికి గురి అయిన అరకులోయ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు, ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో తప్పిదం జరిగిందని, రెండు రోజుల్లో పార్టీ సంప్రదించి సరిదిద్దుకొని మీ పేరు ప్రకటిస్తానని రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారని దోన్ను దొర తెలిపారు. అరకులోయ ఉమ్మడి అభ్యర్థిగా నన్ను ఖరారు చేసి స్పష్టం చేస్తామని ఆయన అన్నారని తెలిపారు, టిడిపి ఖాళీగా ఉన్న స్థానాల్లో మాత్రమే బిజెపి పార్టీకి అవకాశం కల్పించారని అరకులోయ టిడిపి కంచుకోటలో బిజెపికి అసలు ఓటు బ్యాంకు లేని స్థానంలో ఎలా కేటాయిస్తారని ఆయన అన్నారు, కచ్చితంగా గెలుపు సాధించే స్థానం గెలుపు గుర్రాలకే టిడిపి అధినేత గతంలో స్థానాలు కేటాయించారని ఆయన అన్నారు, కూటమిలో బిజెపి పార్టీకి అసెంబ్లీ స్థానం కేటాయిస్తే గెలవడం సాధ్యం కాదని, మేము ఎంత మద్దతు పలికిన బిజెపికి అరకు నియోజకవర్గంలో ఓటు బ్యాంకు లేదని ఆయన అన్నారు, నన్ను సంప్రదించకుండా అరకు అసెంబ్లీ స్థానం మార్పు ఎలా జరిగిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులకు ప్రశ్నించగా పార్టీ అధిష్టానానికి తెలియకుండా జరిగిందని ఎక్కడో తప్పు దొర్లిందని రెండు రోజులలో మన టిడిపి స్థానం అరకులో దొన్ను దొరకే పేరు ప్రకటిస్తామని అధిష్టాన మహామీ ఇచ్చారని ఆయన తెలిపారు, ఫిబ్రవరి 24న మొదటి లిస్టులో నా పేరు ప్రకటించారని అరకులో కచ్చితంగా టిడిపి అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని అధిష్టానం నాకు తెలిపారని ఆయన అన్నారు, కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందవద్దని నేనే సైకిల్ గుర్తుపై అరకులో పోటీ చేయబోతున్నానని అత్యధిక మెజారిటీతో టిడిపి పార్టీ అరకులోయలో గెలుస్తుందని ఆయన స్పష్టం చేశారు,

## బీజేపీతో జతకట్టిన కూటమి పార్టీలను ఓడించండి

**నియోజకవర్గ ఇన్‌చార్జి పాచిపెంట శాంతకుమారి**

**విశాలాంధ్ర-అరకులోయ :** మండలంలోని లోతెరు పంచాయతీ ధనసనివలస,అదరి గ్రామమునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ చైర్ పర్సన్, అరకులోయ నియోజకవర్గం ఇంచార్జి పాచిపెంట శాంతకుమారి పర్యటించిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అక్కడ గిరిజనులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ఓపత్రిక ప్రకటన విడుదల చేశారు. గిరి గ్రామాల్లో అనేక సమస్యలతో సతమత మవుతున్న సమస్యలు పరిష్కరించాలంటూ ఆమె ఆప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి పార్టీతో జతకట్టిన వైసిపి. టిడిపి. జనసేన. పార్టీల వలన గిరిజనులకు ఒరిగేది ఏమీ లేదని కూటమి అభ్యర్థులు ఓట్ల కోసం నమ్మ బోలి మాటలతో మాయ చేస్తారని అలాంటి వారిని నమ్మి మీ అమ్ముల్యమైన ఓటు వృధాచేసి ఐదు సంవత్సరాల కాలంలో వాళ్ల కింద బానిస లాగా ఉండవద్దని ఆమె అన్నారు. గిరిజనుల పక్షన్న సమస్యలపై ఎదుర్కొని నాయకుల పక్షాన ఉండి గిరిజన అభివృద్ధికి మీఅమూల్యమైన ఓటువేసి అభివృద్ధికి సాయసాకారాలు అందించాలని ఆమె ప్రకటనలు కోరారు. అనంతరం ధనసనివలస గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇల్లు పటాలు, అంగన్వాడీ సెంటర్, డ్రైనేజీ, సి.సి రోడ్డు, పోడు పట్టాలు, మంచి నీరు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస సౌకర్యములు కల్పించలేదన్నారు. పి.వి.టి.జి గ్రామమని చిన్న చూపుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధనసనివలస గ్రామ సమస్యలు అన్ని కలెక్టర్, ఐటిడిఏ ప్రోజెక్ట్ అధికారి దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారం అవ్వే దాకా పోరాడుతాని ఆమె గ్రామస్తులకు తెలిపారు. కేంద్రంలో కానీ, రాష్ట్రంలో ఎక్కడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ అభయం పథకం కింద ప్రతి పెద్ద కుటుంబానికి పక్క ఇల్లు, గృహిణులకు ప్రతినెల ఐదు వేల రూపాయలు ఎకౌంట్‌లో డబ్బులు జమ అవుతుందన్నారు. 2024 సంవత్సరంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పట్టం కడితే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా పైతోలి సంతకం పెడతారాని ఆమె తెలిపారు.గిరిజన హక్కులు చట్టలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివాసి కాంగ్రెస్ స్టేట్ కో ఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరావు, దుంబ్రిగుడ మండల ప్రధాన కార్యదర్శి తెడబరికి బిమరావు, అరకు వేలి మండల వైఎస్ ప్రెస్ డేంట్ పాంగి గంగాధర్, మంగ ప్రదీష్ చైతన్య, గ్రామ సినియర్ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు అభిమానులు మహిళ లు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ జయలక్ష్మికి పతి వియోగం

**విశాలాంధ్ర-చింతపల్లి :** స్థానిక ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి కి పతి వియోగం కలిగింది. స్థానిక తపాలా శాఖలో పోస్ట్ మ్యాన్ గా విధులు నిర్వహిస్తున్న ఆమె భర్త సత్యనారాయణ మంగళవారం విధులకు వెళుతున్న క్రమంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను మెరుగైన వైద్య సేవల నిమిత్తం హుటాహుటిన విశాఖ కింగ్ జార్జ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది. సత్యనారాయణ పార్థివ దేహాన్ని స్వస్థలమైన చింతపల్లి అంబేద్కర్ కాలనీకి గురువారం తెల్లవారుజామున తీసు కొచ్చారు. సత్యనారాయణ మృతితో అంబేద్కర్ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. సత్యనారాయణ పార్థీవదేహానికి పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గం అభ్యర్థి విశ్వేశ్వర రాజు లు స్థానిక ప్రజాప్రతినిధులు వైకాపా నాయకులతో కలిసి సందర్శించి పార్థివ దేహానికి నివాళులు అర్పించడంతోపాటు, ఆ కుటుంబానిక ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇదే క్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, సత్యనారాయణ అభిమానులు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## చలివేంద్రాలు ఏర్పాటు చేసిన వీరేష్ దేవ్

**విశాలాంధ్ర-కురుపాం :** తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ఆధ్వర్యంలో కురుపాంలో రెండు చలివేంద్రాలను గురువారం ఉదయం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం తీవ్రత,అధిక ఉష్ణోగ్రత నమోదౌతున్నందున వాహనదారులు, ప్రజలు దాహార్తి తీర్చేందుకు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా, మెయిన్ రోడ్ లో త్రినాథ స్వామి ఆలయం ముందు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్,మండలం కన్వీనర్ కెవి కొండయ్య , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌ను ఆర్‌డీఓ సందర్శన

**విశాలాంధ్ర-బెలగాం :** అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ ట్రైనింగ్ సందర్భంగా గురువారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుచున్న కార్యక్రమాన్ని రెవెన్యు డివిజనల్ అధికారి కె.హేమలత సందర్శించి పరిశీలించారు. అలాగే స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆమెతోపాటు పార్వతీపురం తహశీల్దార్ కె. ఆనందరావు తదితరులు ఉన్నారు.

## వాహనాలు తనిఖీలు నిర్వహించిన ఎఫ్ఎస్‌టి బృందాలు

**విశాలాంధ్ర-సీతానగరం :** ఎన్నికల ప్రవర్తనా నియమావళి తూచ తప్పకుండా పాటించాలని తెలియజేస్తూ వాహనాలను మండల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్‌టి బృందాలు) ముమ్మరంగా తనిఖీలను చేస్తున్నారు. పార్వతీపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మండలానికి రెండు టీములు ఏర్పాటుచేయడం జరిగిందని, ఉదయంపూట ఒక టీమ్, రాత్రిపూట ఒక టీమ్ పర్యవేక్షణ చేస్తుందని పర్యవేక్షకులు చిన్నారావు, మురళిలు తెలిపారు. ఒక్కో టీంకు ఒక్కో వాహనం కేటాయించి పర్యవేక్షకుడు, ఇద్దరు పోలీస్ సిబ్బంది, ఒక వీడియోగ్రాఫర్ ఉంటున్నట్లు తెలిపారు. 24 గంటలపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిశీలన చేస్తూ వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. వీరితోపాటు మండల స్థాయిలో ఎంపిడిఓ ఈశ్వరరావు అధ్యక్షతన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు పర్యవేక్షణ చేస్తున్నారు.

## టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి**

**విశాలాంధ్ర-కురుపాం:** ఏప్రిల్ 29 తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని కురుపాం నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు, భారీ సంఖ్యలో తరలిరావాలని నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి కోరారు. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి దత్తిలక్ష్మణరావు తదితరులు పాల్గొనున్నారని తెలిపారు.

విశాలాంధ్ర

అల్లూరి సీతారామరాజు

పార్వతీపురం మన్యం

పేజీ : 3

శుక్రవారం 29, మార్చి, 2024

## శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

**విశాలాంధ్ర-గరుగుబిల్లి :** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం లో గురువారము శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమములు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా శ్రీషిరిడి సాయి బాబాకు విశేష అర్చనలు అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞయాగకర్త, అసంఖ్యాక దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజి సంపూర్ణ సహాయ సహకారాలతో శ్రీ అనగా దేవి సహిత జైగురుదత్త హెూమ ములను నిర్వహించారు. అదే విధముగా ఈహెూమములు చేయించుకోవడంవల్ల ఈతి బాధలు తొలకడంతో పాటు మనసులో కోరిన కోర్కెలు నెరవేరుతాయని తెలిపారు. ఆలయ అర్చకులు నల్లకాం తం శ్రీనివాసరావు శ్రీఅనగా దేవి సహిత జైగురుదత్త హెూమములను నిర్వహించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈహెూమంలు కార్యక్ర మంలో పాల్గొన్న దంపతులకు దీక్షవస్త్రములను కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే దాతలచే అన్నదానం కార్యక్రమమును నిర్వహించ డం జరిగిందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాద ములను అందజేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవానికి కృషి చేద్దాం

**విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ :** కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రజలందరూ సహకరించాలని పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆశావాహులు బత్తినమోహన్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని డోకిసీల పుట్టూరు తాళ్ల బురిడీ తదితర గ్రామాల్లో పల్లెపల్లెకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గొప్పతనాన్ని వివరిస్తూ ఇందిరమ్మ రాజ్యం స్థాపనకు ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని వైయస్ షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. ఎన్ని పార్టీలు వచ్చినా హస్తం గుర్తుకు మాత్రమే ఓటు వేస్తామని గొంతెత్తి చాటి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్వతిపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాంబాబు, జగదీష్, చొక్కాపు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి

**కొమరాడ ఐసిడిఎస్ పిఓ సుగుణకుమారి**

**విశాలాంధ్ర-గరుగుబిల్లి :** గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారమును విధిగా తీసుకోవాలని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఓ గొట్టాపు సుగుణకుమారి కోరారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం (2 )లో గురువారం గరుగుబిల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ వర్కర్లతో నిర్వహించిన సమా వేశంలో పాల్గొన్న పీవో సుగుణకుమారి మాట్లాడారు. పదిసంవ త్సరాలలోపు వయస్సుగల శిశు మరణాల రేటును తగ్గించడమే ప్రిజమ్10 లక్ష్యమని అన్నారు. ఇందుకు వైద్య సిబ్బంది, అంగన్వా డీ వర్కర్లు, సచివాలయ, మహిళా సమాఖ్య, స్వయం సహాయక సంఘాల సమష్టి కృషితో ఈ కార్యక్రమమును విజయవంతం చేయడం జరుగు తుందన్నారు. రక్తహీనత, హైరిస్క్‌గా గుర్తించిన గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో రక్తహీనత, హైరిస్క్ గర్భిణీ, బాలింతలు వివరాలు, సామ్, మామ్, పిల్లల వివరాలు, రక్త హీనత ఉన్న కిశోర బాలికల వివరాలు అంగన్వాడి వర్కర్లు దగ్గర ఉండాలన్నారు. ఈకార్య క్రమంలో గరుగుబిల్లి సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, అంగన్వాడీవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాధాకృష్ణ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

**విశాలాంధ్ర-చింతూరు :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గల ఇంతులూరు వాగు గ్రామం లో గురువారం రాధాకృష్ణ దేవతల విగ్రహాలను ప్రతిష్టించారు. వంతల సునామని మాతాజీ దంపతుల ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు అయినవిల్లి కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో గత మూడు రోజులు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ట సందర్భంగా హెూమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్న 12 గంటలకు విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఒడిశా నుంచి వచ్చిన రాధాకృష్ణుని భక్తులు గత మూడు రోజులు నుంచి రాత్రి పగలనక హరే రామ హరే కృష్ణ నామ జపించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## స్కిల్ కేసులో అచ్చెన్నాయుడుకు ఊరట

**హర్షం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే**

**విశాలాంధ్ర-పార్వతీపురం:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు స్కిల్ కేసులో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సీఐడీను హైకోర్టు ఆదేశించడంపట్ల పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే, మాజీఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయనవిలేకరులతో మాట్లాడారు. ఇదిలాఉండగా రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపి ఉమ్మడిప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని తెలిపారు. రోజుకు రోజుకు టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం పతనం ఖాయమని తెలిపారు.

## ప్రజల్లోకి దూసుకుపోతున్న బీసీవై పార్టీ అరకు అసెంబ్లీ అభ్యర్థి సాయి



**విశాలాంధ్ర-అరకులోయ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల కొత్తగా ఆవిర్భవించిన భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా మాజీ ఎంపీటీసీ దురియ సాయిబాబాను నియమించిన సంగతి పాఠకులకు విదితమే. అందులో భాగంగానే జరగబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం బీసీ వై పార్టీ ఇన్చార్జిగా దురియా సాయిబాబా నియామకం అయినప్పటి నుండి అరకులోయ నియోజకవర్గ పరిధిలోగల ఆరు మండలాల్లోని మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కోశాధికారుల తోపాటు నియోజకవర్గంలోని 135 పంచాయితీల్లో భారత చైతన్య యువజన పార్టీ క్యాడర్ ను సన్నద్ధం చేస్తూ జరగబోయే ఎన్నికల ప్రణాళికను చాప కింద నీరుల రూపొందిస్తూ ప్రజల్లోకి దూసుకుపోతూ ప్రజలతో మమేకమవుతు రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో యువతరాన్ని రాజకీయంగా అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్న ఉద్దేశంతో బిసి వై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ఆదేశాలతో ముందుకు కొనసాగుతు అరకు లోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి దురియ సాయిబాబా ముందుకు పోతున్నారు.ఈ పార్టీ రాష్ట్ర లోని పలు నియోజకవర్గలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో బిసివై పార్టీ పోటీ చేస్తుండడంతో అధికారపక్ష పార్టీతో పాటు, ప్రతిపక్ష నాయకుల్లో కూడా దడ పుట్టిస్తున్నట్లు పలువురు సీనియర్ విశ్లేషకులు రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నాడు గమనార్హం ఐతే బీసీవై పార్టీ ప్రజల ముందు ఎన్నికల మేనిఫెస్టో ను ఆధారంగా ఓటర్లు అర్థం చేసుకునేలా ప్రకటన చేస్తారనే ఓ నమ్మకం ఓటర్లలో కల్పించేందుకు పక్క ప్రణాళికతో ముందుకు సాగుతుండడం విశేషం

## విజయ్ చంద్రను గెలిపించాలని టీడీపీ నాయకుల ప్రచారం

**విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట :** రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఉమ్మడి పార్టీల అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విజ్ఞప్తి చేస్తున్నారు.గురువారం వారు మండలంలోని ప్రచారాన్ని నిర్వహించారు. వారితో పాటు పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు అభిమానులు కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు.టీడీపి మినీ మ్యానిఫెస్టో గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జససేస, బీజేపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. పట్టణంలో టీడీపీ నాయకులు ద్వారపురెడ్డి శ్రీదేవి, గుంట్రెడ్డి రవికుమార్, మజ్జివెంకటేష్, బార్నాల సీతారాం, కోరెడ్ల నారాయణరావు, గౌరునాయుడు తదితరులు ప్రచారాన్ని నిర్వహించగా, పార్వతీపురం మండలంలోని గొట్టాపు వెంకటనాయుడు, బోనుదేవీ చంద్రమౌళి, గౌరజాన చంద్రమౌళిలు ప్రచారాన్ని నిర్వహించారు. బలిజిపేట మండలంలో టీడీపీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాలనాయుడు, రామ్మోహన్ నాయుడు, మామిడి రాజశేఖర్, మామిడి సాయి తదితరులు ప్రచారం నిర్వహించారు.సీతానగరం మండలంలోని గ్రామాలలో టీడీపీ నాయకులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్, సాల హరి, తెంటు వెంకట అప్పలనాయుడు, అరవింద్, బుడితి శ్రీను, లక్ష్మణరావు, బలగశ్రీను, రెడ్డి సింహాచలం నాయుడు, పారినాయుడు, రమేష్, తెంటు రామారావు భోగిశంకర రావు, తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలుగురించి, మినీ మ్యానిఫెస్టో గూర్చి వివరిస్తూ టీడీపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయ్ చంద్రను గెలిపించాలని కోరుతున్నారు.

## సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే గిరిజన చట్టాలకు రక్షణ

**మళ్లీ గెలిచి గిరిజన సంపద దోచిపెట్టడానికి వస్తున్న నాయకులను నిలదీయండి**

**సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పల నరస**

**విశాలాంధ్ర-చింతపల్లి:** సిపిఎం పార్టీ గెలుపుతోనే గిరిజన చట్టాలు హక్కులకు రక్షణ కలుగుతుందని సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పల నరస అన్నారు. చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల సిపిఎం కార్యకర్తలతో గురువారం చింతపల్లిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవడంలో సిపిఎం పార్టీ ముందు ఉందన్నారు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాలను కాపాడాలనుకుంటే అది సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యపడుతుంద న్నారు. గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి అపారమైన ఖనిజ సంపదను దోచుకు వెళ్లడానికి ఈ ఎన్నికల్లో దొంగ నాయకులు వస్తున్నారని గిరిజన ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటిదాకా చేసిన ఘనకార్యాలను గిరిజనులు ప్రశ్నించి, నిలదీయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు కావస్తున్నా గిరిజన ప్రాంత సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటివరకు గిరిజన ప్రాంతం నుండి గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పదవులను ఉపయోగించుకుని సంపాదించుకున్నారే తప్ప స్థానిక గిరిజనులకు, గిరిజన ప్రాంతానికి ఏమాత్రం ఉపయోగపడలేదని మండిపడ్డారు. ఓ పక్క జీవో నెంబర్ 3 సుప్రీంకోర్టులో రద్దయి గిరిజన నిరుద్యోగ యువత ఆవేదనతో ఉన్నారని, గిరిజన చట్టాలు కళ్ళ ముందు మంట కలిసి పోతుంటే గిరిజన ప్రజా ప్రతినిధులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. బోయ వాల్మీకి లను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తుంటే గిరిజన ప్రజా ప్రతినిధులు తెలిసి కూడా చట్టసభల్లో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అనుమతులు ఇస్తుంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడలేదని అన్నారు మాతృభాష విద్య వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా పొట్ట కొట్టడమే కాకుండా గిరిజన విద్యార్థులను చదువు కోకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ఆదివాసి గిరిజనులు గమనించ వలసిన విషయం అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గెలిచే యోచనలో టిడిపి, బిజెపి, పార్టీలు ఆలోచిస్తున్నాయని ఇది గిరిజనులకు ఏమాత్రం మంచి సంకేతం కాదన్నారు. వైసిపి, టిడిపి, బీజేపీ, జనసేన పార్టీలు ఏ పార్టీ గెలిచిన గిరిజనులకు అన్యాయమే తప్ప న్యాయం జరగదన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గిరిజన వ్యతిరేక విధానాలను అడ్డుకోవడంలో ముందుంటుందని ఇప్పటికే అనేక ఉద్యమాలతో గిరిజనులకు నష్టం చేసే విధానాలను అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల సిపిఎం పార్టీ కార్యదర్శులు పాంగి ధనుంజయ్,అంపురంగి బుజ్జిబాబు ఎం పి టి సి, మండల నాయకులు సాగిన చిరంజీవి పాంగి శ్రీను సత్తిబాబు సర్వోనాయుడు బాలరాజు సూర్యారావు చిరంజీవి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే టికెట్ వంతలకు ఇవ్వాలని టీడీపీ నాయకులు డిమాండ్

**విశాలాంధ్ర-ఎటపాక :** మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. యటపాక మండలం నెల్లిపాక గ్రామంలో కష్టపడిన వారికి టిడిపి టికెట్ ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. టిడిపిలో నిరంతరం కష్టపడి పనిచేసిన వారికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా ఎవరికి తెలియనివాకి టీడీపిలో ఎమ్మెల్యే సీటు ఇవ్వడం ఏమిటని నాయకులు ప్రశ్నించారు. రంప చోడవరం ఎమ్మెల్యే టికెట్ వంతలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపి ప్రభుత్వం హాయాం లో అభివృద్ధి ఎంతో జరిగిందని అలాగే ఈ ఏడు సంవత్సరాలు ప్రజలు వద్దకే పార్టీకి తీసుకెళ్లి ప్రజల కు సైతం సేవ చేసిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కే తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పునారలలోచించి రంపచోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వంతల రాజేశ్వరి కి కేటాయించాలని మండల కమిటీ ఏక గ్రీవ తీర్మానం చేసినారు. ఈ ఐదు సంవత్సరాలు పార్టీకి కష్టపడలేని వాళ్ళకి టిక్కెట్ ఇవ్వడం అనేది చాలా దారుణమని ఇలాంటి పొరపాటు చేసినట్లయితే రేపు రాబోయే రోజుల్లో సామాన్య కార్యకర్త కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధిష్టానంవెంటనే స్పందించి రంపచోడవరం టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ వెంటనే మార్చి వంతలకే ఇవ్వాలని అందరి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు ,అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్ ,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని చందు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పెనుబల్లి సాయి ,మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్, యూనిట్ ఇంఛార్జి బాచినేని మల్లేశ్వర రావు, మాజీ ఎంపీటీసీ ఏపురి వెంకన్న, సర్పంచ్ మోసం రాజులు,సంద్ర రఘు, చేకూరి రమేష్ ,సబ్బినేని వేణుగోపాల్, బండారు భద్రరావు ,బానోత్ సక్రు, పెద్దినేని వెంకటేశ్వరర రావు ,మధు, కమలాకర్, బాచినేని శ్రీకాంత్, గుత్తా వెంకన్న, సామ్య ,పసుపులేటి రాంబాబు.ముత్యాలు , వెల్లంకి శ్రీసు, మాజీ సర్పంచులు పార్టీ బూత్ కన్వీనర్ లు తదితర కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

44